# రాజ్యసభలో 'నోట్ల' రగడ

- కాంగ్రెస్ ఎంపీ సింఘ్వి సీటు వద్ద దొరికిన 50 వేల నగదు
- ప్రకటించిన చైర్మన్ ధన్‌ఖర్
- కాంగ్రెస్‌పై బీజేపీ ఆరోపణలు
- గందరగోళం మధ్య సభ వాయిదా
- డబ్బులు తనవి కాదన్న సింఘ్వి


సింఘ్వి

న్యూఢిల్లీ, డిసెంబర్ 6: రాజ్యసభలో కరెన్సీ నోట్ల కలకలం రేగింది. తెలంగాణ నుంచి ఎన్నికైన కాంగ్రెస్‌కు చెందిన రాజ్యసభ సభ్యుడు అభిషేక్ మను సింఘ్వి సీటు వద్ద రూ.500 నోట్ల కట్ట దొరికినట్టు రాజ్యసభ చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖర్ శుక్రవారం సభలో ప్రకటించారు. గురువారం సభ ముగిసిన తర్వాత భద్రతాపరమైన తనిఖీలు నిర్వహిస్తున్న సిబ్బందికి సింఘ్వికి కేటాయించిన 222 సీటు వద్ద వంద రూ.500 నోట్లున్న కట్ట లభించిందని ఆయన తెలిపారు. ఈ నోట్లపై విచారణకు ఆదేశించినట్టు వెల్లడించారు. ఈ నోట్ల కట్ట తమదే అని ఎవరూ ఇంతవరకు చెప్పలేదని, నగదును మర్చిపోయేంతలా ప్రజల ఆర్థిక స్థితి ఉందని ఈ ఘటన ప్రతిబింబిస్తున్నదా? అని ఆయన అన్నారు.

**అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం**

విచారణ జరపకుండా సభ్యుడి పేరును చైర్మన్ ప్రస్తావించడాన్ని రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే తప్పుబట్టారు. సభకు నోట్ల కట్టలు తీసుకురావడం సరికాదని, ఈ విషయంపై విచారణ జరపాలని పార్లమెంటు వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు పేర్కొన్నారు. 'కొన్ని అంశాలపై మీరు ఆత్రుత ప్రదర్శిస్తారు, ఇంకొన్ని అంశాలను కప్పిపుచ్చాలనుకుంటారు' అంటూ కాంగ్రెస్ సభ్యులను ఉద్దేశించి మరో మంత్రి జేపీ నడ్డా వ్యాఖ్యానించారు. అయితే, అదానీ అంశంపై నుంచి దృష్టి మళ్లించడానికి బీజేపీ ప్రయత్నిస్తున్నదని ప్రతిపక్ష సభ్యులు ఆరోపించారు. సభలో నగదు లభించడంపై కాంగ్రెస్ సమాధానం చెప్పాలని బీజేపీ ఎంపీలు నినాదాలు ప్రారంభించడంతో గందరగోళం నెలకొన్నది. వారికి డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా వినకపోవడంతో సభను సోమవారానికి వాయిదా వేశారు.

**ఒకే ఒక్క రూ.500 నోటుతో వచ్చా: సింఘ్వి**

తాను ఒకే ఒక్క రూ.500 నోటుతో సభకు వచ్చినట్టు అభిషేక్ మను సింఘ్వి 'ఎక్స్'లో పేర్కొన్నారు. గురువారం తాను 12.57కు సభలోకి వచ్చానని, ఒంటి గంటకు సభ వాయిదా పడిందని, మూడు నిమిషాలే తాను సభలో ఉన్నట్టు చెప్పారు. ఇలాంటి విషయాలపై కూడా రాజకీయాలు చేయడం తనకు వింతగా ఉందని అన్నారు. ఎవరో వచ్చి ఏదైనా సీటులో ఏ వస్తువైనా ఎలా పెట్టగలరో విచారణ జరిపించాలని ఆయన పేర్కొన్నారు.

# ఓ సారి కోల్‌కతా వచ్చి చూడండి

- రేవంత్ 'చెత్త' వ్యాఖ్యలపై తృణమూల్ ఫైర్


రిజు దత్త

కోల్‌కతా, డిసెంబర్ 6: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తృణమూల్ కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. కోల్‌కతాను చెత్తనగరంగా పేర్కొంటూ ఆయన చేసిన వ్యాఖ్యలకు ఘాటుగా బదులిచ్చారు. గురువారం హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాను ఉద్దేశించి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. ప్రపంచంలో చెత్త నగరాల పోటీ పెడితే కోల్‌కతా మొదటి స్థానంలో నిలుస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై శుక్రవారం తృణమూల్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి రిజు దత్త స్పందిస్తూ.. 'రేవంత్ రెడ్డివి అసంబద్ధ వ్యాఖ్యలు. కోల్‌కతా ఆనందాల నగరం. భారత్‌కు సాంస్కృతిక రాజధాని. ఈ నగరం వేగంగా అభివృద్ధి చెందుతున్నది. ఆయన(రేవంత్ రెడ్డి) ఓసారి కోల్‌కతా వచ్చి నగరం ఎంత పరిశుభ్రంగా, సుందరంగా ఉందో చూడాలి' అని పేర్కొన్నారు. 'ఇలాంటి అసత్య వ్యాఖ్యలపై మాకు స్పందించాల్సిన అవసరం లేదు. దేశంలోని పరిశుభ్రమైన నగరాల్లో కోల్‌కతా ఒకటి' అని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ డోలాసేన్ వ్యాఖ్యానించారు.

# కన్నడనాట మళ్లీ కుర్చీలాట!

- సీఎం పోస్ట్ కోసం డీల్ కుదిరిందన్న డీకే
- అలాంటిదేమీ లేదన్న సీఎం సిద్ధరామయ్య
- మీలో మీరు ఒప్పందాలు చేసుకొంటూ పోతే మేమెందుకు?: హోంమంత్రి పరమేశ్వర ఫైర్
- పాలనను, ప్రజాక్షేమాన్ని పక్కనబెట్టి సీఎం కుర్చీ కోసం కర్ణాటక కాంగ్రెస్ నేతల కుస్తీ




పరమేశ్వర

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ): కర్ణాటక కాంగ్రెస్‌లో మళ్లీ కుర్చీలాట మొదలైనట్టు కనిపిస్తున్నది. కేపీసీసీ అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తాజాగా చేసిన వ్యాఖ్యలు ఇందుకు మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి. ముడా, వాల్మీకి కుంభకోణాల ఆరోపణలు ఎదుర్కొంటున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మెడకు కేసులు బిగుసుకొంటున్న నేపథ్యంలో అధిష్ఠానం కూడా ముఖ్యమంత్రి మార్పునకు యోచిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. అయితే, పాలనను, ప్రజాక్షేమాన్ని, గ్యారెంటీల అమలును పక్కనబెట్టి ముఖ్యమంత్రి పదవి కోసం కాంగ్రెస్ నాయకులు ఇలా కుస్తీ పడటమేంటని కన్నడ ప్రజలు మండిపడుతున్నారు.

**డీకే ఏమన్నారంటే?**

డీకే శివకుమార్‌ను ఇటీవల ఓ జాతీయ మీడియా ఇంటర్వ్యూ చేసింది. ఈ క్రమంలో యాంకర్ ఆయన్ని ప్రశ్నిస్తూ.. 'కర్ణాటకలో పార్టీని అధికారంలోకి తీసుకు రావడానికి ఎంతో కృషి చేశారు. మరి జీవితాంతం ఇలాగే డిప్యూటీ సీఎంగానే కొనసాగుతారా?' అని అడిగారు. దీనిపై డీకే స్పందిస్తూ.. 'ఎప్పుడూ డిప్యూటీగా నేను ఎందుకు ఉంటా? రాష్ట్రంలో పార్టీ గెలిచిన వెంటనే మా (సీఎం సిద్ధరామయ్యను ఉద్దేశిస్తూ) మధ్య ఒక అవగాహన ఒప్పందం కుదిరింది. ఇప్పుడు ఆ విషయాలను నేను మీడియా ముందు చెప్పలేను. నా టర్మ్ వచ్చే రోజు కోసం ఎదురుచూస్తున్నా' అని బదులిచ్చారు.

**సిద్ధూ స్పందన ఏంటంటే?**

డీకే అధికారం పంపకం ఒప్పందం వ్యాఖ్యలు సర్వత్రా చర్చనీయాంశమైన నేపథ్యంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పందించారు. కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి రాక ముందు తనకు, డీకే శివకుమార్‌కు మధ్య అధికారం పంచుకోవడంపై ఎలాంటి రకమైన ఒప్పందం జరుగలేదని అన్నారు. అయితే, కాంగ్రెస్ అధిష్ఠానం ఏ నిర్ణయం తీసుకొన్నా దానికి తాను కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు.

**ఇక మేమెందుకు?**

సిద్ధరామయ్య, డీకే మధ్య అధికారం పంపకం గురించి ఒప్పందం జరిగిందన్న వ్యాఖ్యలపై హోంమంత్రి జీ పరమేశ్వర కూడా స్పందించారు. మీలో మీరు (సీఎం, డిప్యూటీ సీఎం) ఒప్పందాలు చేసుకొంటూ పోతే.. మేమున్నది ఎందుకంటూ? కాస్త ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నిజంగానే సీఎం, డిప్యూటీ సీఎం మధ్య అలాంటి ఓ ఒప్పందం జరిగినట్లయితే, ఇక మేమంతా ఉన్నది ఎందుకు? ఇక వాళ్లిద్దరినే రాజకీయాలు చేసుకోనివ్వండి. అన్ని పనులనూ వాళ్లనే చక్కబెట్టుకోనివ్వండి. ఇలాంటి డీల్ జరిగినట్టు కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి కూడా నేనైతే ఎక్కడా వినలేదు. అలాంటి ఒప్పందం సాధ్యం కాదు కూడా. ఏదేమైనా అధిష్ఠానం నిర్ణయాన్ని అందరం గౌరవిస్తాం' అని పరమేశ్వర తెలిపారు.

**సమీకరణాలు బేరీజు వేస్తున్న హైకమాండ్**

ముడా, వాల్మీకి స్కామ్‌లతో చిక్కుల్లో పడిన సిద్ధరామయ్యను సీఎం పోస్టు నుంచి తొలగిస్తే, ఆ పదవిలో ఎవరిని కూర్చోబెట్టాలన్న అంశంలో కాంగ్రెస్ హైకమాండ్ సామాజికవర్గ సమీకరణాలను బేరీజు వేసుకుంటున్నట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. సీఎం పదవికి డీకేతో పాటు బీసీ నాయకుడైన జార్కిహోళి, దళిత వర్గానికి చెందిన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పరమేశ్వర పేర్లను సైతం అధిష్ఠానం పరిశీలిస్తున్నది.

## బెంగళూరు వాసులకు కాంగ్రెస్ 'షాక్'

**విద్యుత్తు చార్జీలు పెంచాలని బెస్కామ్ నిర్ణయం**

బెంగళూరు: బెంగళూరు వాసులకు కర్ణాటక కాంగ్రెస్ సర్కారు మరో షాక్ ఇవ్వనుంది. విద్యుత్తు చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపేందుకు సిద్ధమయ్యింది. ఈ మేరకు కర్ణాటక ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్(కేఈఆర్సీ)కి బెంగళూరు ఎలక్ట్రిసిటీ సప్లయ్ కంపెనీ(బెస్కామ్) ప్రతిపాదనలు పంపించింది. మూడు దశల్లో విద్యుత్తు చార్జీలు పెంచాలని బెస్కామ్ నిర్ణయించింది. 2025-26లో యూనిట్‌కు 67 పైసలు, 2026-27లో యూనిట్‌కు 74 పైసలు, 2027-28లో యూనిట్‌కు 91 పైసల చొప్పున పెంచేందుకు అనుమతించాల్సిందిగా కేఈఆర్సీని కోరింది. ఇలాంటి ప్రతిపాదననే ఇంతకుముందు చేయగా కేఈఆర్సీ తిరస్కరించింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక విద్యుత్తు చార్జీలు పెంచడం ఇది రెండోసారి. ప్రభుత్వం ఏర్పడిన కొత్తలోనే చార్జీలు పెంచింది. కాగా, గ్యారెంటీలతో ఖాళీ అవుతున్న ఖజానాను నింపేందుకు ఇప్పటికే పాలు, స్టాంప్ డ్యూటీ, పెట్రోల్, మద్యం ధరలను సైతం ప్రభుత్వం పెంచిన సంగతి తెలిసిందే.

## దేశంలో తొలిసారిగా బధిరులకు టీవీ చానల్

**చానల్ 31ను ప్రారంభించిన కేంద్రం**

న్యూఢిల్లీ: బధిరుల కోసం దేశంలో తొలిసారిగా ఇండియన్ సైన్ లాంగ్వేజ్ (ఐఎస్ఎల్) టీవీ చానల్, చానల్ 31ను కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ శుక్రవారం ప్రారంభించారు. ఇప్పటి వరకు బధిరులకు జాతీయ, ప్రైవేట్ చానళ్లలో రోజుకో వారానికో ఒక గంటో, అరగంటో కేటాయిస్తున్నారు. అయితే ఈ చానల్‌లో 24 గంటలూ వారికి కార్యక్రమాలు ఉంటాయి. ప్రధాని ఈ-విద్యలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ చానల్‌ను నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రిసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్సీఈఆర్టీ) నిర్వహిస్తుంది. సెంట్రల్, స్టేట్ పాఠ్యాంశాలతో కూడి ఉండే కార్యక్రమాలను బధిరులు వీక్షించవచ్చు. ముఖ్యంగా టీచర్లు, విద్యార్థులు, ప్రత్యేక బోధకులకు ఉపయుక్తంగా ఉంటాయి. ఇందులో కెరీర్ గైడెన్స్, మానసిక ఆరోగ్యం వంటి కార్యక్రమాలు ఉంటాయని కేంద్రం ఒక ప్రకటనలో తెలిపింది.

## అవకాశమిస్తే ఇండియా కూటమిని నడిపిస్తా

**మమతా బెనర్జీ ప్రతిపాదన**

కోల్‌కత: ప్రతిపక్ష ఇండియా కూటమి పనితీరు పట్ల పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అవకాశం ఇస్తే ఇండియా కూటమి సారథ్య బాధ్యతలు చేపట్టేందుకు తాను సిద్ధమని ప్రకటించారు. బెంగాల్ వార్తా చానెల్ న్యూస్ 18 బంగ్లాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా తన పాత్రను కొనసాగిస్తూనే ప్రతిపక్ష కూటమికి సారథిగా వ్యవహరిస్తూ రెండు బాధ్యతలను సమర్థంగా నిర్వహించగలనని చెప్పారు. ఇండియా కూటమిని తాను ఏర్పాటు చేశానని, అవకాశం ఇస్తే కూటమి సజావుగా నడిచేలా చూసుకుంటానని మమత చెప్పారు. బెంగాల్ నుంచే కూటమిని నడిపించగలనని పేర్కొన్నారు.

## తనఖా రహిత రుణ పరిమితి 2 లక్షలకు పెంపు

**రైతులకు ఆర్బీఐ శుభవార్త**



ముంబై, డిసెంబర్ 6: చిన్న, సన్నకారు రైతులకు రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) తీపి కబురు అందించింది. తనఖా రహిత రుణ పరిమితిని రూ.2 లక్షలకు పెంచుతున్నట్టు శుక్రవారం ప్రకటించింది. పెరిగిన పెట్టుబడి ఖర్చులు, ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో ఉంచుకొని రుణ పరిమితిని సవరించినట్టు తెలిపింది. బ్యాంకుల వద్ద ఎటువంటి తనఖా లేకుండా రైతులు ఇప్పటివరకు రూ.1.6 లక్షల వరకే రుణాలు పొందే అవకాశం ఉన్నది. దీనిని ఇప్పుడు రూ.2 లక్షలకు పెంచింది. 2010 వరకు రైతుల రుణ పరిమితి లక్ష వరకే ఉండగా దానిని 2019లో రూ.1.6 లక్షలకు పెంచారు. తాజాగా పెంచిన రుణ పరిమితి వల్ల చిన్న, సన్నకారు రైతులు లబ్ధి పొందుతారని రిజర్వు బ్యాంకు గవర్నర్ శక్తికాంత దాస్ చెప్పారు. రుణ పరిమితి పెంపుపై త్వరలోనే బ్యాంకులకు సర్క్యులర్ జారీ చేస్తామని వెల్లడించారు.

## 6 నెలల్లో వెరిఫికేషన్ పూర్తిచేయాలి

**ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైన వారిపై రాష్ర్టాల పోలీసులకు సుప్రీంకోర్టు నిర్దేశం**

న్యూఢిల్లీ, డిసెంబర్ 6: ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైన వారి ప్రవర్తన, వ్యక్తిత్వం, జాతీయత, నిజాయతీలకు సంబంధించిన దస్ర్తాల ధ్రువీకరణను వారి నియామక తేది నుంచి ఆరు నెలల్లోగా పూర్తి చేయాలని అన్ని రాష్ర్టాల పోలీసులకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలు జారీ చేసింది. అభ్యర్థుల యోగ్యతా పత్రాలను ధ్రువీకరించిన తర్వాతనే వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని ఈ నెల 5న ధర్మాసనం తీర్పు చెప్పింది. బసుదేవ్ దత్తా అనే ఆప్తాల్మిక్ అసిస్టెంట్‌ను ఉద్యోగ విరమణ చేయడానికి రెండు నెలల ముందు తొలగిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పక్కన పెడుతూ ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది.

## భారత్ సరిహద్దుల్లో బంగ్లాదేశ్ కిల్లర్ డ్రోన్లు

**అప్రమత్తమైన ఆర్మీ**

ఢాకా, డిసెంబర్ 6: ఇప్పటికే పలు కవ్వింపు చర్యలకు పాల్పడుతున్న పొరుగుదేశమైన బంగ్లాదేశ్.. అవసరమైతే దాడికి కూడా వెనుకాడమన్న రీతిలో భారత్ సరిహద్దుకు సమీపంలో టర్కీ తయారీ ఫ్లాగ్ టీబీ2 కిల్లర్ డ్రోన్లను మోహరించింది. బంగ్లాదేశ్‌లో ప్రధాని హసీనా పదవి నుంచి దిగిపోయిన తర్వాత ఈ ప్రాంతంలో ఉగ్రవాద కార్యకలాపాలు అధికమైనట్టు ఇంటెలిజెన్స్ వర్గాలు తెలిపాయి. నవభారత్ టైమ్స్ కథనం ప్రకారం ఈ డ్రోన్లు పశ్చిమ బెంగాల్ సరిహద్దు సమీపంలో మోహరించి ఉన్నాయి. బంగ్లాదేశ్ ఆర్మీ ఈ టీబీ2 డ్రోన్లు రక్షణ, నిఘా మిషన్లలో వినియోగిస్తుంది. దీనిపై భారత్ ఆర్మీ స్పందిస్తూ.. తాము అప్రమత్తమయ్యామని, హెరన్ టీపీ లాంటి డ్రోన్లను మోహరించి ఉంచామని, ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపింది. కాగా, రెండు దేశాల మధ్య ఏర్పడిన ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో బంగ్లాదేశ్.. భారత్‌లో ఉన్న ఇద్దరు దౌత్యవేత్తలను వెనక్కి పిలిపించింది.


## పాక్ ద్వంద్వ వైఖరి బట్టబయలు

**ఉగ్రవాది మసూద్ అజర్ బహిరంగ ప్రసంగంపై భారత్**

న్యూఢిల్లీ: ఉగ్రవాది మసూద్ అజర్ బహిరంగ సభలో పాల్గొని, భారత్, ఇజ్రాయెల్ దేశాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయడంపై భారత ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రపంచ ఇస్లామిక్ రాజ్య స్థాపన కోసం భారత్, ఇజ్రాయెల్ దేశాల లక్ష్యంగా జీహాదీ కార్యకలాపాలను తిరిగి ప్రారంభిస్తానని మసూద్ శపథం చేసినట్లు తెలుస్తున్నది. దీనిపై విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ, పాకిస్థాన్ ద్వంద్వ ప్రమాణాలను పాటిస్తున్నదని దుయ్యబట్టారు. జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజర్ పాకిస్థాన్‌లో ఉన్న విషయాన్ని ఆ దేశం నిరంతరం నిరాకరిస్తూ వస్తున్నదన్నారు. పాకిస్థాన్‌లో జరిగిన సభలో మసూద్ మాట్లాడినట్లు వచ్చిన వార్తలు నిజమే అయితే, ఆ దేశపు నయవంచన తేటతెల్లమైనట్లేనని వ్యాఖ్యానించారు.

# గుండెలో 'మినీ బ్రెయిన్'

- హృదయ స్పందనను నియంత్రించేది ఇదే!
- అమెరికా, స్వీడన్ పరిశోధకుల అధ్యయనం



స్టాక్‌హోమ్, డిసెంబర్ 6: మెదడు నుంచి వచ్చే సంకేతాల ఆధారంగా గుండె పని చేస్తుందనేది ఇప్పటివరకు వైద్యులు విశ్వసిస్తున్న విషయం. అయితే, గుండె తన సొంత నాడీ వ్యవస్థపైనే ఆధారపడి పని చేస్తుందని తాజాగా పరిశోధకులు గుర్తించారు. స్వీడన్‌లోని కరోలిన్స్క ఇన్‌స్టిట్యూట్, అమెరికాలోని కొలంబియా యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు ఈ కొత్త విషయాన్ని కనుగొన్నారు. మనుషుల శరీరతత్వంతో పోలికలు ఉండే జీబ్రాఫిష్‌పై వీరు నిర్వహించిన అధ్యయనం వివరాలు 'నేచర్ కమ్యూనికేషన్స్' అనే జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ఈ అధ్యయనం ప్రకారం... ఇప్పటివరకు గుండెలోని నాడీ వ్యవస్థ కేవలం మెదడుపై ఆధారపడే పని చేస్తుందని అందరూ భావిస్తున్నారు. అయితే, గుండెలో సంక్లిష్టమైన న్యూరాన్ల వ్యవస్థ ఉందని పరిశోధకులు గుర్తించారు. 'మినీ బ్రెయిన్'గా పరిశోధకులు పేర్కొంటున్న ఈ వ్యవస్థనే హృదయ స్పందనను నియంత్రిస్తున్నది. ఎలాగైతే కదలికలు, ఊపిరి తీసుకోవడాన్ని మెదడు క్రమబద్ధీకరిస్తుందో, అలాగే ఈ గుండెలోని మినీబ్రెయిన్.. హృదయ స్పందనను నియంత్రిస్తున్నది. అరిథ్మియా వంటి గుండె సంబంధ వ్యాధుల చికిత్సకు తమ అధ్యయనం ఉపయోగపడుతుందని పరిశోధకులు పేర్కొన్నారు.

## ఐదింట ఒకటి సిజేరియన్ డెలివరీనే

**తెలంగాణలో 60.7% సిజేరియన్ ప్రసవాలే**

న్యూఢిల్లీ: దేశంలో ఐదు వంతులకు పైగా ప్రసవాలు సిజేరియన్(సి సెక్షన్) ద్వారానే జరుగుతున్నాయి. వీటిలో అత్యధికం ప్రైవేట్ దవాఖానలలోనే జరుగుతున్నట్లు లాన్సెట్ రీజినల్ హెల్త్-సౌత్‌ఈస్ట్ ఏషియా జర్నల్ జరిపిన తాజా అధ్యయనం వెల్లడైంది. సహజ కాన్పుకు బదులుగా ఆపరేషన్ చేసి శిశువును తీయడాన్ని సిజేరియన్‌గా వ్యవహరిస్తారు. భారత్‌లో సిజేరియన్ ప్రసవాలు 21.5 శాతం ఉన్నట్లు అధ్యయనంలో పేర్కొన్నారు. సిజేరియన్ డెలివరీలు నాగాలాండ్‌లో 5.2 శాతం ఉండగా, తెలంగాణలో 60.7 శాతం ఉన్నట్లు అధ్యయనంలో తేలింది.

## మరాఠ్వాడాలో రైతుల మృత్యుఘోష

**11 నెలల్లో 822 మంది ఆత్మహత్య**

ఛత్రపతి శంభాజీనగర్: బీజేపీ పాలిత మహారాష్ట్రలోని మరాఠ్వాడా ప్రాంతానికి చెందిన 8 జిల్లాలలో 2024లో 800 మందికిపైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ప్రభుత్వ అధికారి ఒకరు శుక్రవారం వెల్లడించారు. వీరిలో 303 మంది కుటుంబాలకు నష్టపరిహారం చెల్లింపు జరిగిందని, మరో 314 కేసులలో దర్యాప్తు జరుగుతున్నదని ఆయన తెలిపారు. డివిజనల్ కార్యాలయం అందజేసిన నివేదిక ప్రకారం మరాఠ్వాడాలో 822 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. బీడ్ జిల్లాలో అత్యధికంగా 160 మంది రైతులు బలవన్మరణానికి పాల్పడ్డారు. నవంబర్ 30 వరకు 303 కేసులలో రూ. 3.03 కోట్ల నష్ట పరిహారం చెల్లించగా మరో 314 కేసులకు సంబంధించి దర్యాప్తు పెండింగ్‌లో ఉంది. బీడ్ తర్వాత రైతుల ఆత్మహత్యలు అత్యధికంగా నాందేడ్(146), ధారాశివ్(143)లో చోటుచేసుకున్నాయి.

# రైతులపై టియర్ గ్యాస్

- చలో ఢిల్లీ పాదయాత్ర ఉద్రిక్తం
- పలువురు రైతులకు గాయాలు
- అంబాలలో ఇంటర్నెట్ బంద్



న్యూఢిల్లీ, డిసెంబర్ 6: తమ డిమాండ్ల సాధనకు రైతులు శుక్రవారం చేపట్టిన 'ఢిల్లీ చలో' కార్యక్రమం ఉద్రిక్తంగా మారింది. హర్యానా-పంజాబ్ సరిహద్దు శంభు వద్ద రైతులపై పోలీసులు బాష్ప వాయువు ప్రయోగించడంతో పలువురు రైతులు గాయపడ్డారు. జాతీయ రహదారి 44పై ఏర్పాటు చేసిన బారికేడ్లను దాటుకుని రావడానికి ప్రయత్నించిన రైతులపై పోలీసులు బాష్ప వాయువు ప్రయోగించడంతో గందరగోళం ఏర్పడింది. దీంతో ఒక రైతు నేత, వృద్ధ రైతుతో పాటు మరికొందరు గాయపడ్డారు. వారిని అంబులెన్స్‌లలో దవాఖానలకు తరలించారు.

**భారతా.. పాకిస్థాన్ బోర్డరా?**

పోలీసుల బాష్పవాయువు ప్రయోగంతో శుక్రవారం తమ పాదయాత్రను తాత్కాలికంగా నిలిపివేశామని, ఆదివారం తమ యాత్రను పునఃప్రారంభిస్తామని రైతు నేత శర్వణ్ సింగ్ పాంధేర్ ప్రకటించారు. టియర్ గ్యాస్‌తో రైతు నేత సుర్జీత్ సింగ్ ఫుల్ సహా 8 మంది రైతులు గాయపడ్డారని ఆయన చెప్పారు.

**బారికేడ్లు.. బాష్పవాయు గోళాలు..**

సంయుక్త కిసాన్ మోర్చా (రాజకీయేతర), కిసాన్ మజ్దూర్ మోర్చా ఆధ్వర్యంలో మధ్యాహ్నం 101 మంది రైతులతో ప్రారంభించిన ర్యాలీ జాతీయ రహదారి 44పై ఉన్న బారికేడ్ల వద్దకు చేరుకుంది.బారికేడ్లను ఛేదించుకుని రాజధాని ఢిల్లీ వైపు రావడానికి రైతులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకుని బాష్ప వాయువును ప్రయోగించడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి.కాగా, ఈనెల 9 వరకు అంబాల జిల్లాలోని 11 గ్రామాలకు ఇంటర్నెట్‌ను బంద్ చేయడమే కాక, బల్క్ మెసేజ్‌ల సర్వీసులను నిలిపివేసినట్టు అలాగే అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలను మూసివేస్తున్నట్టు అంబాల జిల్లా అధికారులు చెప్పారు.

**గ్యారెంటీకి కట్టుబడి ఉన్నాం: కేంద్రమంత్రి**

రైతుల ఆందోళన ప్రారంభానికి ముందు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పార్లమెంట్‌లో ఒక ప్రకటన చేశారు. రైతుల నుంచి కనీస మద్దతు ధరతో పంటను కొనుగోలు చేయడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. 'ఇది మోదీ ప్రభుత్వం.. మోదీ గ్యారంటీకి మేము కట్టుబడి ఉన్నాం' అని ఆయన ప్రకటించారు.

## ట్రంప్ ప్రచారం కోసం మస్క్ 2 వేల కోట్లు ఖర్చు!

వాషింగ్టన్: ప్రపంచ కుబేరుడు మస్క్ అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచారం చివరి అంకంలో డొనాల్డ్ ట్రంప్ గెలుపు కోసం 250 మిలియన్ డాలర్లకు పైగా (సుమారు రూ.2,110 కోట్లు) ఖర్చు పెట్టినట్టు గురువారం విడుదలైన ఫెడరల్ ఫైలింగ్స్ వెల్లడించాయి. ఇలా కేవలం ఒక దాత నుంచి వచ్చిన విరాళాలు ట్రంప్ పరిపాలన అమల్లోకి రావడానికి దోహదపడ్డాయి. ట్రంప్‌పై హత్యాయత్నం జరిగిన తర్వాత ఆయన ప్రచారానికి మస్క్ భారీగా ఖర్చు పెట్టారు.

# గంటకు 1,100 కిలోమీటర్ల వేగం!

- భారత్‌లో హైపర్‌లూప్ ఏర్పాటు దిశగా కీలక అడుగు
- 410 మీటర్ల టెస్ట్ ట్రాక్ పూర్తి చేసిన ఐఐటీ మద్రాస్
- ముంబై - పుణె మధ్య తొలి దశ హైపర్‌లూప్ నిర్మాణం



న్యూఢిల్లీ, డిసెంబర్ 6: భారతదేశ రవాణా వ్యవస్థలో సరికొత్త శకం మొదలుకాబోతున్నది. విమాన వేగంతో పోటీపడి ప్రయాణించే హైపర్‌లూప్ వ్యవస్థ ఏర్పాటు దిశగా కీలక ముందడుగు పడింది. చెన్నై సమీపంలో 410 మీటర్ల హైపర్‌లూప్ టెస్ట్ ట్రాక్ పూర్తయ్యింది. ఇందుకు సంబంధించిన వీడియోను రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఐఐటీ మద్రాస్, రైల్వే శాఖ కలిసి ఈ ట్రాక్‌ను నిర్మించాయి. అధునాతన హైపర్‌లూప్ సాంకేతికతను దేశంలో అభివృద్ధి చేసేందుకు ఐఐటీ మద్రాస్‌లో 'ఆవిష్కార్' పేరుతో 76 మంది విద్యార్థులతో కూడిన ప్రత్యేక బృందం, ఐఐటీ మద్రాస్‌లోనే స్థాపించిన 'టూటర్' అనే స్టార్టప్ పని చేస్తున్నాయి. టెస్ట్ ట్రాక్ పూర్తి కావడంతో ఈ సాంకేతికతను పరీక్షించడం కోసం ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి.

**ముంబై - పుణె మధ్య మొదటి దశ**

హైపర్‌లూప్ పాడ్‌లు మధ్యలో ఎలాంటి స్టాప్‌లు లేకుండా ఆరంభ స్టేషన్ నుంచి గమ్యస్థానానికి ప్రయాణిస్తాయి. అందుకే వీటిని ఇంటర్ సిటీ ట్రాన్స్‌పోర్ట్‌గా ఏర్పాటుచేసేందుకు అంతర్జాతీయంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. మన దేశంలో ముంబై-పుణె కారిడార్‌లో మొదటి హైపర్‌లూప్ ప్రాజెక్టు ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. రోడ్డు ప్రయాణానికి మూడు గంటలు పట్టే ఈ రెండు స్టేషన్ల మధ్య హైపర్‌లూప్‌లో 25 నిమిషాల్లోనే చేరుకోవచ్చు. ఆ తర్వాత చెన్నై - బెంగళూరు, ఢిల్లీ - చండీగఢ్ మధ్య కూడా హైపర్‌లూప్ ఏర్పాటు చేయాలనే ఆలోచనలు ఉన్నాయి. పుణెకు చెందిన క్విన్‌ట్రాన్స్ హైపర్‌లూప్ అనే అంకుర సంస్థ కూడా హైపర్‌లూప్ కార్గో వ్యవస్థ ఏర్పాటు కోసం ప్రయత్నిస్తున్నది.


**ఏమిటీ హైపర్‌లూప్ టెక్నాలజీ?**


హైపర్‌లూప్ అనే హైస్పీడ్ రవాణా వ్యవస్థ ఆలోచన 2012లో మొదటిసారి టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ మదిలో పుట్టింది. తక్కువ పీడనం ఉండే ట్యూబ్(భారీ పైప్‌లైన్ లాంటిది)లో చిన్న పాడ్(రైలు బోగీ లాంటిది)ల ద్వారా ఈ ప్రయాణం కొనసాగుతుంది. ఒక్కో పాడ్‌లో 24 నుంచి 28 మంది ప్రయాణించవచ్చు. అయస్కాంతాలతో ఒత్తిడి కలిగించి, రాపిడి(ఫ్రిక్షన్) తగ్గించడం ద్వారా అత్యంత వేగంతో ఈ పాడ్‌లు ఒక చోట నుంచి మరో చోటకు ప్రయాణిస్తాయి. గంటకు 1,100 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే సామర్థ్యం ఉండేలా హైపర్‌లూప్ వ్యవస్థను రూపొందిస్తారు. హైపర్‌లూప్ వ్యవస్థ ప్రయాణ వేగాన్ని గణనీయంగా పెంచడంతో పాటు ఇంధన అవసరాన్ని తగ్గిస్తుంది.

# రోదసిలో పుతిన్ రహస్య ఆయుధం

**ఏకంగా అణ్వాయుధాన్నే మోహరిస్తున్న రష్యా**

**'కాస్మోస్ 2553' ఉపగ్రహ సాయంతో సన్నాహాలు**





మాస్కో: రష్యాకు చెందిన రహస్య ఉపగ్రహం 'కాస్మోస్ 2553' ప్రపంచ దేశాలను కలవరపెడుతున్నది. ప్రస్తుతం డమ్మీ వార్‌హెడ్ (ఆయుధం)తో భూకక్ష్య వెలుపలి హద్దుల్లో సంచరిస్తున్న ఈ ఉపగ్రహం సాయంతో మున్ముందు క్షిపణులను, అణ్వాయుధాలను ప్రయోగించి శత్రు దేశాలకు చెందిన పలు కీలక ఉపగ్రహాలను నాశనం చేసేందుకు రోదసిలో రష్యా ఓ ప్లాట్‌ఫామ్‌ను అభివృద్ధి చేస్తున్నట్టు భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. అంతరిక్షంలో రష్యా మోహరించే ఆయుధానికి సంబంధించిన విడిభాగాలను ఈ ఉపగ్రహం పరీక్షిస్తున్నట్టు తాము భావిస్తున్నామని, దీని వల్ల ఎదురయ్యే ముప్పును తమ స్పేస్ కమాండ్ నిరంతరం పరిశీలిస్తున్నదని అమెరికా అధికారులు 'న్యూయార్క్ టైమ్స్' పత్రికకు తెలిపారు. రష్యా సైనిక బలగాలను ఉక్రెయిన్‌లోకి పంపడానికి కొన్ని రోజుల ముందు (2022 ఫిబ్రవరిలో) రష్యాలోని ప్లెసెట్స్క్ కాస్మోడ్రోమ్ నుంచి సూయజ్-2 రాకెట్ ద్వారా 'కాస్మోస్ 2553'ను నింగిలోకి పంపారు. అనంతరం ఆ ఉపగ్రహాన్ని దిగువ భూకక్ష్య చివరి అంచున (భూమికి దాదాపు 2 కి.మీ. ఎత్తున) చేర్చారు. ఆ ప్రాంతమంతా వాన్ అలెన్ బెల్ట్స్ నుంచి వచ్చే రేడియో ధార్మికతతో సంతృప్తమై ఉంటుంది. ఇది ఉపగ్రహ భాగాలను నిర్వీర్యం చేస్తుంది. పనికిరాని లేదా నిలిపివేసిన ఉపగ్రహాలను నిశ్శబ్దంగా వాటంతటఅవే నాశనమయ్యేలా చేసేందుకు దూరంగా ఆ ప్రాంతంలోకి పంపుతారు. దీంతో ఆ ప్రాంతాన్ని 'శ్మశాన కక్ష్య' అని పిలుస్తున్నారు. ఈ నేపథ్యంలో 'కాస్మోస్ 2553'ను ఆ కక్ష్యలో నిలపడం అమెరికా ఖగోళ పరిశీలకుల్లో అనుమానాలను పెంచుతున్నది.